హరిత దీపావళి.. ఆనందాల కేళి



- గో గ్రీన్ దీపావళితో అంతా సురక్షితం
- బాణసంచా కాలుష్యంపై పెరుగుతున్న అవగాహన



అల్లిపురం: దీపావళి వెలుగుల పండగ. ఇది మన జీవితాల్లో కాంతులు నింపుతుంది. చెడుపై మంచి సాధించే విజయానికి నిదర్శనం. చీకటిని పారద్రోలి జ్ఞానాన్ని పంచే పండగ. కానీ మన అనాలోచిత నిర్ణయాలతో పండగను కాలుష్యకారకంగా మారుస్తున్నాం. చెవులు బద్దలయ్యే శబ్దాలు, ఊపిరితిత్తులు భరించలేని పొగను విడుదల చేసే బాణసంచాతో అగచాట్లు కొని తెచ్చుకుంటున్నాం. శబ్ద, వాయు కాలుష్యంతో భూమిని కఠినంగా మారుస్తున్నాం. కొన్ని చిట్కాలు పాటిస్తే దీపావళిని పర్యావరణహితంగా మార్చవచ్చు.

ఏటా బాణసంచాతో వచ్చే కాలుష్యం అంతా ఇంతా కాదు. చాలా మంది చిన్నారులు బాణాసంచా కాల్చే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే గో గ్రీన్ దీపావళి తప్పనిసరని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

గ్రీన్ దీపావళి జరుపుకోవడం ఇలా..

- దూరంగా ఉండి బాణసంచా కాల్చాలి. అతి తక్కువ శబ్దం, పొగ వెదజల్లేవి కాల్చాలి.
- వెలుతురు, కాంతి కోసం సంప్రదాయ పద్ధతులు పాటించడం, మట్టి ప్రమిదలు, కొవ్వొత్తులు వెలిగించాలి. విద్యుత్ దీపాలు వాడకూడదు. విద్యుత్ వృథా అవుతుందనే విషయాన్ని గమనించాలి.

చిన్నారులను భాగస్వాములను చేయాలి

ప్రతి దీపావళికి చిన్నారులను భాగస్వాములను చేయాలి. కుటుంబ సభ్యులతో మొక్కలు నాటించేలా పెద్దలు సమాయత్తం కావాలి. బాణసంచా **కాలుష్యాన్ని తగ్గించాలంటే** పచ్చదనమే దిక్కు. ఈ **విషయాన్ని అవగాహన** కల్పిస్తూ మొక్కను వారికి బహుమతిగా ఇవ్వాలి.

- పాఠశాలలు తమ సిబ్బంది, విద్యార్థులకు టపాసులు కాల్చడం వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించాలి. ప్రమిదలు, దీపాలు, పువ్వులతో దీపావళిని ఆనందంగా జరుపుకోవడానికి అవసరమైన సలహాలు ఇవ్వాలి.
- పాఠశాల యాజమాన్యాలు దీపావళి బాణసంచాతో కలిగే కాలుష్యంపై విద్యార్థులతో చర్చించాలి. వారిని అందులో భాగస్వాములను చేయాలి. ఆరోగ్యం, వాతావరణ పరంగా జరిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించాలి.
- బంధువుల, స్నేహితులు, అపార్ట్‌మెంట్లలో అందరూ కలిసి పండగ జరుపుకుంటే సందడిగా ఉంటుందని గ్రహించాలి. బాణసంచాను సైతం తక్కువగా వినియోగించేలా కాలనీ, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు సమావేశాల్లో నిర్ణయించుకోవాలి.

హితం కావాలి..



దీపావళి మనకు ఆనందం కలిగించాలి. కాలుష్యాన్ని, తద్వారా అనారోగ్యాన్ని కలిగించే విధంగా మారకూడదు. ప్రస్తుతం భూమి అనేక సమస్యలతో ఇబ్బంది పడుతుంటే కాలుష్యంతో దాన్ని మరింత ఇబ్బంది పెట్టకూడదు.

– ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ప్రధానోపాధ్యాయుడు, ఎంజీఎం హైస్కూల్

పచ్చదనంతోనే రక్షణ..



అన్ని సమస్యలు తీరాలంటే పచ్చదనమే రక్ష. దీన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి. టపాసులతో శబ్ద, వాయు, భూమి, నీటి కాలుష్యం ఏర్పడుతుంది. దీంతో పర్యావరణం దెబ్బతిని అనేక వ్యాధులు కలిగే అవకాశముంది. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకోవాలి.

– ఎం.ఆనంద్, ప్రధానోపాధ్యాయులు, అల్లిపురం మోడల్ స్కూల్

ప్రజల ఊపిరితో ఆటలాడొద్దు

దాబాగార్డెన్స్: డేటా సెంటర్ల పేరిట ప్రజల ఆస్తి, పర్యావరణం, వనరులను ధ్వంసం చేసే ప్రయత్నాన్ని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తీవ్రంగా ఖండించారు. ఇది అభివృద్ధి కాదు–ఇది ప్రజల ఊపిరిని కట్టేసే నయా విధ్వంసం. ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గకపోతే ప్రజా ఉద్యమం తుపానుగా ఎగసిపడుతుందంటూ ఘాటుగా హెచ్చరించారు. అమెరికా, సింగపూర్ దేశాల్లో ప్రజలు డేటా సెంటర్లకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి నిరసనల మంటలు రాజేస్తున్నారు. వాటివల్ల కాలుష్యం, వేడి, నీటి కొరత పెరిగిపోయాయి. ఆ సమస్యలు అక్కడ చూసినప్పటికీ మన ప్రభుత్వం అదే తప్పు చేయడానికి సిద్ధపడుతుందని దేవీశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 22 వేల కోట్ల రాయితీలు, ఉచిత కరెంటు, నీరు, భూమి ఇవన్నీ కార్పొరేట్ కంపెనీలకు ఉచితంగా ఇచ్చి, ప్రజలపై భారం వేయాలని చూస్తోందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

హరేరామ హరేకృష్ణ మహామంత్రంతో ఏకాహం

దాబాగార్డెన్స్: పాతనగరంలోని చెంగల్రావుపేట కోదండ రామాలయంలో ఆలయ ఈవో నీలిమ సహకారంతో రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థచే హరే రామ హరేకృష్ణ మహామంత్రంతో 24 గంటల పాటు ఏకాహం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని గంటి అభినయ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కందర్ప రాధ, జి.అభినయ్, పలువురు భక్తులు సామూహికంగా హరేరామ హరేకృష్ణ మహామంత్రాన్ని సామూహికంగా ఆలపించారు. నిర్విరామంగా 24 గంటల పాటు నిర్వహించిన ఏకాహంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, విజయరమణి, ఆలయ అర్చకుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురుస్వామి వసంతరావు ఇకలేరు



దాబాగార్డెన్స్: తూర్పు కోస్తా రైల్వేలో పీఏ టు డీఆర్ఎంగా పదవీ విరమణ చేసిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం విశాఖ శాఖ కార్యదర్శి వసంతరావు (79) మధుమేహ వ్యాధితో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో లక్ష్మీ వరసిద్ధి వినాయక భవానీ శంకర ఆయాన్ని స్థాపించి, ఆలయ అధ్యక్షుడిగా చక్కటి సేవలందించారు. కేరళ శబరిమలై భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘానికి సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా రాష్ట్రం తరఫున సేవలందించారు. 82 సార్లు శబరిమలై అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. 41 సార్లు మకరజ్యోతి దర్శనం కూడా చేశారు. వసంతరావు అకాల మృతికి అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం విశాఖ శాఖ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు కాన్వెంట్ జంక్షన్ సమీపాన ఉన్న హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు వసంతరావు భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ ఆక్షన్‌లోనే బంజరు భూముల కొనుగోలు

- టీడీఆర్‌లో ఎటువంటి అవకతవకలు లేవు
- మీడియాను ఆశ్రయించిన బాధితులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌చంద్ర

దాబాగార్డెన్స్: వేపగుంటలో మాస్టర్ ప్లాన్ సదుపాయాల కల్పనకు జీవీఎంసీ సేకరించిన భూములు ప్రభుత్వ, దేవస్థానం భూములు కావని బాధితుల తరఫున గారపాటి శరత్‌చంద్ర స్పష్టం చేశారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తమ నుంచి కొంత ఆశించారని, అయితే తాము తిరస్కరించడంతో తమ భూములకు సంబంధించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. టీడీఆర్ పేర్లతో స్వాహా అంటూ ప్రచురితమైన వార్తల్లో ఏమాత్రం నిజం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆక్షన్‌లోనే బంజరు భూములు తాము కొనుగోలు చేసామన్న విషయాన్ని గుర్తు చేశారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగానే ఉందని తగిన నష్టపరిహారం ఆశిస్తున్నామని తెలిపారు.

కూటమి నేతలూ.. కళ్లు తెరవండి

దాబాగార్డెన్స్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో భవిష్యత్ తరాల కోసం, పేద విద్యార్థుల వైద్య చదువుకు, పేదలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందివ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాక సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి నేతలు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మినిస్టర్ వంగలపూడి అనిత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలువురు మంత్రులు జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు తీసుకు రాలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పాటు పలు కళాశాలల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో మచిలీపట్నం మెడికల్ కళాశాలకు 12, నంద్యాల మెడికల్ కళాశాలకు 16, విజయనగరం మెడికల్ కళాశాలకు 12, రాజమండ్రి 16, ఏలూరు మెడికల్ కళాశాలకు 4 అదనపు సీట్లను ఎన్‌హెచ్‌సీ మంజూరు చేసిందన్నారు. ఒక వేళ కళాశాలల నిర్మాణమే జరగకపోతే 60 మెడికల్ సీట్లు ఎలా మంజూరు చేసిందో చెప్పాలని కూటమి పెద్దలను పాక సత్యనారాయణ ప్రశ్నించారు. డేటా సెంటర్‌కు విశాఖకు తీసుకురావడం కూడా జగన్‌మోహన్‌రెడ్డి చొరవేనని కూటమి పెద్దలు గ్రహించాలన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు కూడా జగన్‌మోహన్ రెడ్డే అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తెరగాలన్నారు. కూటమిలో ఉన్న మంత్రులు, నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరిచి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను చూడాలన్నారు.

మత్స్యకారుల మోముల్లో వెలుగు



సాగరంలో చేపల వేట మత్స్యకారులకు ఎప్పుడూ ఒక పోరాటమే. కానీ.. ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కనిపించిన దృశ్యం ఆ కష్టానికి తగిన ఫలితాన్ని కళ్లకు కట్టింది. నిత్యం సాగరంలో వేట చేసే మత్స్యకారులకు ఆదివారం పంట పండింది. వారి బోట్లు నిండుగా మత్స్య సంపదతో ఒడ్డుకు చేరాయి. దీంతో వారి మోముల్లో సంతోషం వెల్లివిరిసింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అలరించిన లక్ష్మీప్రియ గాత్ర కచేరీ

దాబాగార్డెన్స్: రామ్‌నగర్ రాఘవేంద్రస్వామి మఠంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో వాగ్గేయకారుడు దీక్షితార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఆర్.లక్ష్మీప్రియ దీక్షితార్ రచించిన సంకీర్తనలు మధురంగా ఆలపించి అలరింపజేశారు. వయొలిన్‌పై కె.గాయత్రి వరేణ్య, మృదంగంపై పీవీఎస్ బాలాజీ యువరాజ్ వాద్య సహకారం అందించారు. సమితి చైర్మన్ వెంకట్రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, వీవీబీ శంకరం, కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్మోహనరావు, జి.మధుబాబు, మధుసూదనరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ దివాళీతోనే పర్యావరణ హితం

దాబాగార్డెన్స్: ప్రజలు హరిత దీపావళి జరుపుకోవాలని పలువురు పర్యావరణవేత్తలు పిలుపునిచ్చారు. నగరంలో ప్రతిచోట దీపావళి రోజున మతాబులు, మందుగుండు సామగ్రి కాల్చడం వల్ల వాయు, శబ్ద కాలుష్యంతో చిన్న పిల్లలు, వృద్ధులతో పాటు పశువులు, మూగజీవులు ఆందోళన చెంది ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. వాయు కాలుష్యం వల్ల నగరమంతా పొగ పేరుకుపోయి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. మతాబులు కాల్చిన వ్యర్థాలకు నిప్పు పెట్టి కాల్చడం వల్ల వాయు కాలుష్యం నగరమంతా వ్యాపించి ప్రజల ఆరోగ్యాలకు భంగం కలుగుతుందన్నారు. ప్రజలందరూ అందమైన దీపాలు ప్రతి ఇంట వెలిగించి హరిత దీపావళి, స్వచ్ఛ, శుభ దీపావళిగా రంగు రంగుల దీపాలతో గ్రీన్ దీపావళి ఆనందంగా జరుపుకోవాలని ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కూటమి నిర్ణయంతో పేదలకు వైద్య విద్య దూరం



చిలకవీధిలో సంతకాలు సేకరిస్తున్న 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ తదితరులు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు

జగదాంబ: మెడికల్ కళాశాల రద్దును నిరసిస్తూ జీవీఎంసీ 39వ వార్డులో పార్టీ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి లేదని, పేదలకు వైద్య విద్యను దూరం చేసేలా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం ఉందన్నారు. దానిని నిరసిస్తూ చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు యాసీన్ బాబ్జీ, సత్య, చేపల అప్పలరాజు, ఆదినారాయణ, అప్పారావు, ధనరాజు, తాతారావు, రవి, రమణ, మాధురి, ఆదిలక్ష్మి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ..

అల్లిపురం: కూటమి ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. పార్టీ వార్డు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వార్డు కమిటీ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 22న ఆమె యూఎస్ వెళ్తున్న కారణంగా సంతకాల సేకరణ కార్యక్రమం వార్డు సీనియర్ నాయకులు లండ రమణ, లింగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు వారికి సహకరించాలని పద్మావతి కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండ రమణ, లింగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.